# యథా శిష్యా- తథా గురు


పి.వి.డి.యస్.ప్రకాష్

**'యథా రాజా తథా ప్రజా' అన్నది పాత సూత్రం. నేటి ఆధునిక విద్యార్థిలోకం అటువంటి సామెతనే తిరగేసి సృష్టించిన వైనం... !**

"సురేష్ ఏడీ! ఎక్కడున్నాడు?" అడిగాను ఆఫీను నుంచి వస్తూనే.

"ఎక్కడో ఆడుకోవడానికి వెళ్ళినట్లున్నాడు-సాయంత్రం కదా!" అంది శ్రీమతి.

"వాడు జీవితంలో బాగుపడడే! చదువంటే శ్రద్ధ లేదు. బొత్తిగా బడి దొంగయిపోయాడు" అంటూ బాత్‌రూంలో కెళ్లి ముఖం, కాళ్లూ చేతులూ కడుక్కొని వరండాలోని కుర్చీలో కూర్చున్నాను.




శ్రీమతి కాఫీ పట్టుకొచ్చింది. "మళ్లీ ఏమయింది? తప్పకుండా రోజూ బడి కెడుతున్నాడు కదా!" అడిగింది శ్రీమతి.

"ఏం వెళ్లడమో, ఏమిటో? ఆఫీను నుంచి వస్తుంటే వాడి మాస్టారు కనిపించారు. వారం రోజులయింది మన సుపుత్రుడు బడి ముఖం చూసి. ఆయన చెప్పారు."

"ఆ!" అంది శ్రీమతి.

సురేష్‌కు పన్నెండేళ్లు. ఏడో తరగతి చదువుతున్నాడు. ఎపుడూ ఆటలు, సినిమాల మీదే ధ్యాన. బడికి వెళ్లమంటే ఒకటే మారాం. మొన్న మొన్నటి దాకా తనే బలవంతంగా బడికి దిగబెట్టేవాడు. ఈమధ్య ఆఫీసులో పని ఒత్తిడి అధికమై తొందరగా వెళ్లాల్సి వస్తోంది. దాంతో మళ్లీ బడికి ఎగనామం పెడుతున్నాడు వాడు. ఓ సమస్యగా తయారయ్యాడు సురేష్. వాడు చదువుకొని పెద్ద ఉద్యోగం చేయాలని, చాలీచాలని తన గుమస్తా జీవితానికి వాడు వారసుడు కాకూడదని ఎన్నో ఆశలు-కోరికలు.

"ఏమండీ! వాడు రాగానే ఇంతెత్తున ఎగిరి పడకండి. నెమ్మదిగా బోధపరచండి. అంతే కాని మీకున్న ఆవేశమంతా వెళ్లగక్కి పిల్లాడిని బెదరకొట్టకండి. ఏదో చిన్నతనం. స్కూలంటే భయం. అంతే!" శ్రీమతి చెబుతోంది.

నాకు చిర్రెత్తుకొచ్చింది- "ఎన్నాళ్ళు చిన్నవాడు? రోజు రోజుకూ ఎదుగుతున్నాడు కదా!" గట్టిగా అరిచాను.

"అదే... అదే... ఆ కోపమే వద్దనేది! పెళ్లయిన దగ్గర నుంచి చూస్తూనే ఉన్నాను మిమ్మల్ని. చీటికీ మాటికీ అలక, సాధింపు. పిల్లల్ని దారిలోకి తేవాలంటే కాస్త సహనం, ఓర్పు ఉండాలి" అంటోంది శ్రీమతి.

మౌనంగా ఉన్నాను ఏమనాలో తోచక.

"నాన్నా!" అంటూ వచ్చాడు సురేష్. చేతిలో క్రికెట్ బాట్, బాల్. ఛోటా గవాస్కర్‌లా ఉన్నాడు నా కళ్లకి వాడు.



అచ్చంగా మా అమ్మలా లేనూ?

"నాన్నా! ఆఫీసు నుంచి వచ్చేశావా? స్వీట్స్ ఏంతెచ్చావ్ నాకు?" అడిగాడు ముద్దుముద్దుగా.

మా వంశాంకురం వాడొక్కడే. అందుకే వాడంటే అంత ముద్దు. ప్రతిరోజూ ఆఫీసు నుంచి వస్తూ వాడు తినేందుకు ఏదో ఒకటి తేవడం అలవాటు. ఇవాళ మాస్టారు చెప్పిన కబురుతో కోపం వచ్చి ఏం తీసుకురాలేదు.

"సురేష్! పోయి కాళ్ళు చేతులూ కడుక్కోనిరా! భోంచేద్దువుగాని" అంది శ్రీమతి.

భోజనాల దగ్గర-

"ఏరా! బడికి వెడుతున్నావా?" అడిగాను నేను.

"ఓ! రోజూ వెడుతున్నాను, నాన్నా! మాస్టారు చెప్పే పాఠాలు నేర్చుకొంటున్నాను. ఈ రోజు హోంవర్క్ కూడా ఎక్కువగా ఉంది, నాన్నా! భోంచేశాక ఆ హోంవర్కు కాస్త నాకు చెప్పవా! అర్థం కావడంలేదు."

"నోర్ముయ్! బడికెళ్ళి వారం రోజులయిందని మీ మాస్టారు చెప్పారు నాకు. అబద్ధా లాడుతున్నావా?" అడిగాను ఆవేశం అణచుకోలేక.

వాడు బిక్కచచ్చిపోయాడు.

శ్రీమతి కళ్ళతోనే నన్ను వారిస్తోంది- 'వాడు భోంచేయ'డని.

నేనేం మాట్లాడలేదు. భోజనం అయిన తర్వాత వాడిని గుండెల కదుముకుని చెప్పాను- "బాబూ! చదువుకోవాలిరా! బాగా బాగా చదవాలి. ఎంతో ఎంతో ఎదగాలి. తెలుసా? నీకేం కావాలన్నా కొని తెస్తున్నానా, లేదా? మరి నే కోరినట్లు బుద్ధిగా ప్రతిరోజూ స్కూల్‌కి వెళ్ళి చదువుకోవా?" అడిగాను నేను.

నాకు ఎంతో చదవాలని ఉన్నా కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించక మధ్యలోనే మానేసి, ఓ ఆఫీసులో ఇలా గుమస్తాగా చేరిపోయాను. వాడు... వాడలా కాకూడదు. ఏ డాక్టరో, లాయరో కావాలి. సమాజంలో సగర్వంగా తలెత్తుకొని తిరగాలి.

అందమైన అపరంజి లాంటి భార్యతో సురేష్ కారులో వెడుతున్న దృశ్యం నా కళ్ళ ముందు కదలాడింది. అ దో కల! మధురమైన కల!

xxx xxx xxx

"నాన్నా! కాంపిటీషన్లో నాకు మొదటి బహుమతి వచ్చింది." ఎగిరి గంతులేస్తూ చెప్పాడు సురేష్ నే నింటికి రాగానే.

వాడి చేతుల్లో నటరాజు విగ్రహం ఉంది. దాన్ని మురిపెంగా చూసుకుంటున్నాడు వాడు. నా కాశ్చర్య మేసింది. ఎప్పుడూ సినిమాలు, షికార్లు, ఆటలు, అల్లరి తప్ప వేరే ఏం ఎరుగని సురేష్ పోటీల్లో మొదటి బహుమతి పొందాడా?

అసలు స్కూల్లో ఏ సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు?

స్వాతంత్ర్య దినోత్సవమా అనుకోవడానికి సెప్టెంబర్‌లో ఉన్నాం.

అక్టోబర్ రెండో తేదీ గాంధీ జయంతి. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని జాతి నేతల స్ఫూర్తి విద్యార్థుల్లో కలిగించేందుకు పోటీలేమైనా నిర్వహించారేమో?

ఏది ఏమయినా ప్రతిభ ఉన్నవాడుగానే నిరూపించుకొన్నాడు నా వారసుడు.

ఆనందం కళ్లలో ప్రతిఫలిస్తుండగా సురేష్‌ని దగ్గరకు తీసుకొన్నాను.

"ఏరా! ఎప్పుడు జరిగాయి పోటీలు? నా కెపుడూ చెప్పలేదేం. పోటీల కోసం తయారయినట్లు కన్పించలేదు. మొదటి బహుమతి కొట్టేశా వన్నమాట!" ముద్దులతో ముంచేస్తూ వాడు ఉక్కిరిబిక్కిరయిపోతుంటే ఆనందిస్తున్నాను.

శ్రీమతి మా ఇద్దర్ని చూస్తూ ముసిముసిగా నవ్వుకొంటోంది.

"చూశావే! వీడు... వీడు తెలివయినవాడే. ఏకసంథాగ్రాహి" అన్నాను నేను. తిరిగి వాడితో- "బాబూ! ప్రతిరోజూ బడికి క్రమం తప్పకుండా వెళ్లి చదువుకొంటే బడికే కాదు; జిల్లా, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉత్తీర్ణుడ వవుతావు" అన్నాను.

"ఇది బళ్లో కాంపిటీషన్లు కావు, నాన్నా!"

"మరీ?"

"మరి... మరి... సినీ హీరో కృష్ణకాంత్ పుట్టినరోజు వేడుకలు!"

అర్థం కాలేదు నాకు.

వాడే వివరించాడు- "నాన్నా! కృష్ణకాంత్ లేడూ! ఈ రోజు పుట్టారన్నమాట. ఆ హీరో నలభైవ జన్మదినోత్సవ వేడుకలు రాష్ట్రమంతటా అభిమానులు చేస్తున్నారు. మన వీధిలో కృష్ణకాంత్ అభిమాన సంఘం వారు ఈ సందర్భంగా రాత పరీక్ష నిర్వహించారు, డాడీ!"

"రాత పరీక్షా?" అడిగాను నేను.

ప్రశ్న పత్రం నా కిచ్చాడు వాడు. చూశాను.

కృష్ణకాంత్ ఎపుడు, ఎక్కడ జన్మించారు?

ఎంత వరకూ చదువు కొన్నారు?

అతని అసలు పేరేమిటి?

అతను నటించిన మొదటి తెలుగు సినిమా ఏది? ఎన్ని రోజు లాడింది?

ఇప్పటి వరకూ కృష్ణకాంత్‌తో నటించిన హీరోయిన్‌లు ఎంతమంది?

కృష్ణకాంత్ చిత్రసీమలో తొలిసారిగా ఆలపించిన గీత మేది? అది ఏ చిత్రంలోది?

కృష్ణకాంత్ ఏ చిత్రంలో నటిస్తుండగా ఘోరప్రమాదానికి లోనయి ఆస్పత్రిలో చేరాడు?

అక్కడ ఎన్ని రోజులు చికిత్స పొందాడు?

ఆ సమయంలో కృష్ణకాంత్‌ను పరామర్శించిన సినీ ప్రముఖు లెంత మంది?

అసలు పలకరించని హీరోయిన్ ఎవరు?

కృష్ణకాంత్ సొంతంగా నిర్మించిన చిత్రం ఏది? ఎపుడు విడుద లయింది? ఎన్ని రోజు లాడింది?

కృష్ణకాంత్ జీవితాశయం ఏమిటి?

చదువుతున్న నాకు నవ్వొచ్చింది. ఏడుపూ వచ్చింది.

కృష్ణకాంత్ హీరో అనిమాత్రమే తెలును నాకు. అంతకుమించి ఈ వివరాలేం తెలీవు నాకు.

"నాన్నా! అన్ని ప్రశ్నలకూ అన్ని సమాధానాలూ కరెక్టుగా రాశాను. అందుకే ఆ పోటీలో నెగ్గినందుకు ఈ బహుమతి ఇచ్చారు. అన లెవ్వరూ రాయలేకపోయారు నాన్నా!" ఆనందంగా అంటున్నాడు వాడు.

స్వాతంత్ర్యం రాక ముందు యువతలో దేశ స్వాతంత్ర్యం లక్ష్యంగా ఉండేది. ఓ గాంధీ, సుభాష్ చంద్రబోసు; ఓ నెహ్రూ, ఓ అల్లూరి



సీతారామరాజు- అప్పటి యువతకు స్ఫూర్తినిచ్చే హీరోలు.

మరి నేడో?

నిర్దిష్టమైన లక్ష్యం లేని యువతకు హీరోలు- ఓ కృష్ణకాంత్, ఓ భీమారావు, ఓ కనకేశ్వరరావు. హతవిధీ!

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు నాకు. అపుడే టేబుల్ మీద రెపరెప లాడుతున్న ఓ కాయితంపై నా దృష్టి పడింది చూశాను.

అది ప్రోగ్రెస్ కార్డు.

"అదెపుడు ఇచ్చారా?" అడిగాను.

"రెండు రోజులైంది, నాన్నా! సంతకం చేయించా లనుకొంటానే మరిచాను." అతి నిర్లక్ష్యంగా చెప్పాడు వాడు. విద్యలో వాడి ప్రోగ్రెస్ అసలు లేదు. అది ఆ కార్డులో స్పష్టమైంది. అన్ని సబ్జెక్టులలోనూ గుండు సున్నలే.

నేను ప్రోగ్రెస్ కార్డును పరీక్షగా చూస్తుంటే వాడు ఆ బహుమతిని చూసుకొని మురిసిపోతున్నాడు.

** ** **

"మీరు గమనించారో, లేదో! ఈ మధ్య మీ సురేష్ రెగ్యులర్‌గా బడికి వస్తున్నాడండీ. బాగా మారాడు" అన్నా డాయన.

ఆయన మా వాడి స్కూల్ టీచర్. ఇదివరలో సురేష్ సక్రమంగా బడికి రావడం లేదని నా దృష్టికి తీసుకు వచ్చింది ఈయనే.

"గమనిస్తున్నాను. అంతా మీ చలవ, మాస్టారూ! మా వాడిని బాగా చదివించండి. అదే నాకు కావలసింది. కొట్టయినా, తిట్టయినా వాడు మంచి మార్కులతో పాసయ్యేలా చూడండి" అన్నాను నేను.

"ఈ కాలం పిల్లలు కొడితే తిడితే లొంగ రండి. టీచర్లకు పిల్లల మనస్తత్వం అర్థం కావాలి. అపుడే అతడు ఉత్తమ టీచర్ అవుతాడు. పిల్లల అభిరుచి తెలుసుకొంటూ, వారికి నచ్చినా రీతిలో పాఠాలు చెబుతూ ఆకట్టుకోవాలి. పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిరక్షించుకోవాలి. హాజరు లేకుంటే టీచర్ దండుగని ఎక్కడికో విసిరి పారేస్తారు." నవ్వా డాయన.

"అవునండీ! పిల్లల మనస్తత్వం అర్థం చేసుకోవాలి కదా!" అన్నాను నేను ఏం అనాలో తోచక.

"ఇపుడు మేం పాఠాలు చెప్పడంలో కూడా కొన్ని విప్లవాత్మకమైన మార్పులు చేశాం. అందుకే క్రమం తప్పకుండా విద్యార్థులు స్కూల్‌కి వస్తున్నారు."

"ఆ మార్పు లేమిటి, మాస్టారూ?"

"ఆ! ఏముంది. చెప్పేస్తే 'ఓస్ ఇంతేనా' అంటారు మీరు. అయినా ఆ ఆలోచన వచ్చినందుకు గర్వపడాలి కదండీ! ఉదాహరణకి మీ సురేష్ ఉన్నాడు. సినిమాల పిచ్చి. హీరో 'కృష్ణకాంత్' అంటే అభిమానం. మరో విద్యార్థి ఉన్నాడు. 'గవాస్కర్' అంటే వెర్రిప్రేమ. అంతే! ఓ క్లాసులో కృష్ణకాంత్ చిత్ర విజయాలు వివరిస్తే, మరో క్లాస్‌లో గవాస్కర్ క్రికెట్ క్రీడా ప్రతిభ వల్లెవేస్తాం. నాగస్వరం విన్న పాముల్లా ఆ పిల్లలు పాఠశాల విడిచినా ఇళ్లకు పోవడం లేదంటే నమ్మండి!"

"మరి పాఠా లెపుడు చెబుతున్నారు మాస్టారూ?"

"అడిగారూ? అడుగుతా రనుకొన్నాను. మధ్య మధ్య కాలక్షేపం కోసం ఓ పాఠంలోఓ ముక్క అలా చెబుతామంతే."

కాలక్షేపపు క్రీడలు, సినిమాలు పాఠా లయ్యాయి. బతుకు తెరువు చూపించే పాఠాలు, విజ్ఞానం పంచే పుస్తకాలు కాలక్షేపా లయ్యాయి. కాస్త అటూ- ఇటూ అంతే- మనసులో అనుకొన్నాను.

"ఆ! మరి ఉంటానండి. సినీఫీల్డుకు మరో కొత్త హీరో వచ్చాడట. వాడి వివరా లేమిటో ఈ రాత్రి మననం చేస్తే కాని రేపు తరగతి గదిలో విద్యార్థులు నన్ను నిలవనీయరు. ఓ సినీ వారపత్రిక కొని ఈ రాత్రి కంఠస్థం చేయాలి" అంటూ చకచకా వెళ్లా రాయన.


చేష్టలుడిగి నిలుచున్నాను ఆయన వెళ్ళిన వైపే చూస్తూ. *



## అన్యోన్యాశ్రయం

వృక్షాలు, జంతువులు సహజీవనం గడపడం సామాన్యమే. ప్లాటీహెల్మిన్‌తస్ వర్గానికి చెందిన కన్‌వల్యూటా రాసోఫెన్సిస్ శరీరం ఆకుపచ్చగా కనిపించడానికి దాని శరీరంపై ఉన్న ఆకుపచ్చని శైవలాలే కారణం. శైవలాల కిరణజన్య సంయోగక్రియ వల్ల ఏర్పడే ఆమ్లజని ఆహార పదార్థాలను జంతువులు వినియోగిస్తూ, శైవలాలకు ఉపయుక్తమైన నత్రజని పదార్థాలను విసర్జిస్తాయి.

సమ్మెట [హన్మకొండ]



'నాకంటి వెలుగువి' అంటుంది మా అమ్మ

## పిల్లలకు ప్రత్యేకం

★ ఎండలో ఆడుకుంటున్నా, తిరిగినా నల్లబడిపోతాం కదా! ఎండలో పనిచేసే వాళ్లు నీడలో ఉండే వాళ్లకన్నా నల్లగా ఉంటారు.

మన శరీరంలో 'మెలానిన్' అనే నల్లని పదార్థముంటుంది. ఇది మన శరీరాన్ని ఎండ వేడిమి నుంచి కాపాడగలుగుతుంది. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు ఆ ఎండలోకి మనం వెడితే మెలానిన్ పదార్థం చర్మం రెండు పొరల మధ్య పొరలా చేరి సూర్య కిరణాల నుంచి రక్షణ నిస్తుంది. ఈ మెలానిన్ ఉత్పత్తి ఎండ తీవ్రతనుబట్టి పెరుగుతుంది. అందుకే చల్లని ప్రాంతాల్లో నివసించేవారు తెల్లగానూ, ఎండ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వారు నల్లగానూ ఉండటం.

మన చర్మంలో రెండు పొర లుంటాయి; పై పొర, లోపలి పొర. ఈ రెండు పొరల మధ్య మెలానిన్‌ను ఉత్పత్తి చేసే గ్రంథు లుంటాయి. ఈ మెలానినే ఒకే చోట పోగుబడితే పుట్టుమచ్చ రూపొందుతుంది.